పెద్దాస్పత్రి అభివృద్ధికి కృషి

నెల్లూరు (దర్గామిట్ట): దర్గామిట్టలోని పెద్దాస్పత్రి అభివృద్ధికి కృషి చేయాలని మెడికల్ కళాశాల, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద కోరారు. పెద్దాస్పత్రిలోని హెచ్‌డీఎస్ కార్యాలయ చాంబర్‌లో ఆస్పత్రి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యు డు శ్రీనివాసులు, ఏడీ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.









మద్యానికి డబ్బివ్వలేదని దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యానికి డబ్బులివ్వలేదనే అక్కసుతో వ్యక్తిపై ఇద్దరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. కూలీ పనులు చేసుకునే కుసుమ దళితవాడకు చెందిన ప్రసాద్ ఈ నెల 17వ తేదీ రాత్రి ఇంటికి బయల్దేరారు. కుసుమ దళితవాడ పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి అదే ప్రాంతానికి చెందిన చంద్రా, ప్రేమ్ ఆయన్ను అడ్డగించి మద్యానికి డబ్బివ్వాలని కోరారు. తన వద్ద లేవని చెప్తున్నా, వినిపించుకోకుండా విచక్షణరహితంగా దాడి చేశారు. విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపుతామని బెదిరించారు. ప్రసాద్ అన్న కుమారుడు రాజేష్ రావడాన్ని గమనించిన దుండగులు పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.











'రత్నం'లో ఉగాది సంబరాలు



నెల్లూరు (టౌన్): సరస్వతీనగర్‌లోని కిషోర్స్ రత్నం, కిడ్స్, రేస్ ఇంటర్నేషనల్, టెక్నో మెడికల్ ఒలంపియాడ్ పాఠశాలల్లో ముందస్తు ఉగాది సంబరాలను మంగళవారం నిర్వహించారు. సంప్రదాయ దుస్తులను ధరించిన విద్యార్థులు గోపూజ చేశారు. ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు బలరామయ్యనాయుడు, రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్, ఏఓ సునీల్, ప్రిన్సిపల్స్ మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర, కోఆర్డినేటర్ ప్రిసిల్లా పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ నెల్లూరు - 1 డిపోలో అత్యధిక ఈపీకే, కేఎమ్పీఎల్‌ను సాధించిన ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికయ్యారు. వీరికి అభినందన సభను డిపో గ్యారేజీలో మంగళవారం నిర్వహించారు. ఆదర్శ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలను డిప్యూటీ సీటీఎం చిరంజీవిరావు, సీఎంఈ శ్రీనివాసులురెడ్డి అందజేశారు. వరుసగా మూడుసార్లు అత్యధిక ఈపీకేను సాధించిన కండక్టర్ శైలజకు డిపో మేనేజర్ మురళీకృష్ణ సొంతంగా ప్రత్యేక నగదు ప్రోత్సాహకాన్ని ఇచ్చారు. అసిస్టెంట్ మేనేజర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సుఖసంతోషాలతో ఉగాదిని జరుపుకోవాలి

నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని ప్రజలు సుఖసంతోషాలతో జరుపుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ కాంక్షించారు. ప్రజలకు ఉగాది శుభాకాంక్షలను తెలియజేశారు.

మసీదుల వద్ద నిరంతర పారిశుధ్య నిర్వహణ

నెల్లూరు సిటీ: రంజాన్‌ను పురస్కరించుకొని మసీదుల వద్ద 24 గంటలూ పారిశుధ్య నిర్వహణ చేయాలని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్, హెల్త్ విభాగాధికారులు, ముస్లిం మత పెద్దలతో సమావేశాన్ని నిర్వహించారు.. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఎస్ఈ సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జన్యు లోపాలున్న వారికి ఉచిత చికిత్స

నెల్లూరు(అర్బన్): పెద్దాస్పత్రిలోని డైస్ కేంద్రంలో అందిస్తున్న ఉచిత చికిత్స ద్వారా జన్యు లోపాలున్న వారిని సాధారణ వ్యక్తులతో కలిసిపోయేలా చేయొచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ పేర్కొన్నారు. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవాన్ని పెద్దాస్పత్రి ఆవరణలోని బాలభవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఆర్బీఎస్కే జిల్లా కో ఆర్డినేటర్ సుధీర్‌బాబు, బాలభవిత కేంద్ర మేనేజర్ జమీర్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎమ్మెల్యేల తీరు దారుణం

నెల్లూరు(సెంట్రల్): అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేలు అనుసరించిన తీరు క్షమించరాని నేరమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కామరాజు, రవి పేర్కొన్నారు. వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం నివాళులర్పించిన అనంతరం వారు మాట్లాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత ఎమ్మెల్యేలు, స్పీకర్‌పై వారు వ్యవహరించిన తీరు దుర్మార్గమని చెప్పారు.

వీఆర్‌కు దర్గామిట్ట ఎస్సై

నెల్లూరు(క్రైమ్): దర్గామిట్ట పోలీస్‌స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న రామారావును జిల్లా వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ విజయారావు ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. ఆయన స్థానంలో ఎవరికీ పోస్టింగ్‌ను ఇవ్వలేదు.





